సాక్షి ఒడిశా

మంగళవారం । 8 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,83,986లు, బంగారం 4 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 18 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఎలుగు బంటి హల్‌చల్

నబరంగ్‌పూర్ జిల్లాలో ఎలుగు హల్‌చల్ చేసింది. స్థానికులు ఆందోళన చెందారు.

- 8లో



హుండీ ఆదాయం లెక్కింపు

మజ్జి గౌరి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.1.04 కోట్లు వచ్చింది.

- 8లో

న్యూస్‌రీల్

రెండు కొత్త రైళ్ల ఏర్పాటుకు కృషి

- కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రదాన్

కొరాపుట్: కొరాపుట్ జిల్లాకి కొత్తగా రెండు రైళ్లు వేసేందుకు కృషి చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ హామీ ఇచ్చారు. జయపూర్‌లో మీడియాతో సోమవారం మాట్లాడారు. న్యూఢిల్లీ వెళ్లిన వెంటనే కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్టవ్‌తో సమావేశమై రైళ్ల ఏర్పాటు విషయాన్ని ప్రస్తావిస్తానని స్పష్టం చేశారు. జగదల్‌పూర్–భువనేశ్వర్, జగదల్‌పూర్–సంబల్‌పూర్–రౌర్కెలాకు పగటి వేళలో రైళ్లు నడిచేలా ప్రయత్నం చేస్తానన్నారు. తన ప్రాంతం పశ్చిమ ఒడిశా నుంచి కొరాపుట్‌కి పగటి పూట రైళ్లు ఎంతో అవసరం ఉందని ధర్మేంద్ర ప్రదాన్ అన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



అరెస్టయిన రఘునాథ్ హరిజన్‌తో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: అక్రమంగా నాటు సారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు జయపురం అబ్కారీ అధికారి శశికాంత దత్త సోమవారం తెలిపారు. అరెస్టయిన వారిలో జయపురం సమితి హరడాపుట్ డొంగర వాసి రఘునాథ్ హరిజన్, కుందారిగుడ గ్రామానికి చెందిన గోపాల్ నాగ్ ఉన్నట్టు చెప్పారు. కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రఘునాథ్ గ్రామం వద్ద తమ సిబ్బంది ఆదివారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా స్కూటీలో సారాను తరలిస్తున్న ఒకరు పట్టుబడినట్టు చెప్పారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని ఓ వీధిలో సారాతో గోపాల్ నాగ్‌ను అరెస్టు చేశామన్నారు. ఎక్సైజ్ అధికారి శశికాంత దత్త, ఏఎస్సై బలరాం దాస్ దాడుల్లో పాల్గొన్నారు.

జగన్నాథునికి పానకం నివేదన



నందిఘోష్ రథంపై శ్రీ జగన్నాథునికి మట్టి పాత్రల్లో పానకం సమర్పణ

భువనేశ్వర్: ఏటా పవిత్ర ఆషాఢ శుక్ల ద్వాదశి సందర్భంగా రథాలపై దేవుళ్లకు పానకం సమర్పిస్తారు. చీకటి పడ్డాక ఈ సేవ నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఆ సంప్రదాయాన్ని పాటించారు. ప్రత్యేక మట్టి పాత్రల్లో పానకం నింపుతారు. మూల విరాట్ల పెదవుల ఎత్తు వరకు ఈ పాత్రలు తయారు చేస్తారు. వీటి నిండా సుగంధ ద్రవ్యాలతో రుచికరమైన పానకం పోసి రథాలపై తెరచాటున గోప్యంగా నివేదించడం ఆచారం. ఈ సమగ్ర ప్రక్రియను ఒధొరొ పాణ సేవగా పేర్కొంటారు. రథాలపై ప్రధాన విగ్రహాల ఎదురుగా మట్టి పాత్రల్ని నిలిపి ఒధొరొ పాణ సేవ నిర్వహిస్తారు. స్వామికి పానకం నివేదించడం పూర్తయ్యాక పాత్రలు పగల గొట్టడంతో రథాల పైనుంచి పాణకం పొరలుతుంది. రథాల పైనుంచి పార్శ్వ దేవతల మీదుగా నేలకు ఈ పానకం జారుతుంది. ఇలా జారిన పానకం పార్శ్వ దేవతలు, అశరీర జీవులు సేవించి మోక్షం పొందుతారని విశ్వాసం. పవిత్ర ఆషాఢ శుక్ల ద్వాదశి పురస్కరించుకుని సోమవారం ఈ సేవ జరిగింది.

గాలి వర్షంతో నేలకూలిన చెట్లు

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడుతున్నాయి. ముఖ్యంగా బొయిపరిగుడ సమితిలో అత్యధిక వర్షాలతో పాటు పెనుగాలులు వీస్తుండడంతో చెట్లు, ఇళ్లు కూలిపోతున్నాయి. నదులు పొంగుతున్నాయి. ఆదివారం సాయంత్రం బొయిపరిగుడ సమితి టంగిణిగూడ రహదారి, విజయవాడ–రాంచీ 326 జాతీయ మార్గంలో భారీ చెట్లు విరిగిపడడంతో ఇరుపక్కల వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బొయిపరిగుడ అగ్నిమాపక అధికారి సుకాంత కుమార్ ప్రధాన్ నేతృత్వంలో అచ్యుత ఓరమ్, రాజేష్ ప్రధాన్, గోవర్ధన హిమిక, కులమణి కిశాన్ తదితర సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజామున చెట్లను తొలగించారు. అలాగే బొయిపరిగుడ పంచాయతీ మాలాగుడ, మాలిగుడ, పూజారిగుడ గ్రామ పంచాయతీ లింబగుడ ప్రాంతాలలో చెట్లు రోడ్లపై పడి రాకపోకలకు అంతరాయం లేకుండా అగ్నిమాపక సిబ్బంది వాటిని రంపాలతో కోసి తొలగించారు.


ప్రసవ 'వే'దన





మల్కన్‌గిరి జిల్లాలోని ఖయిరొపుట్ సమితి బొండాఘాటి వద్ద సోమవారం ఓ గర్భిణిని డోలీపై పది కిలోమీటర్లు మోసుకెళ్లారు. సమితిలోని భొజ్‌గుడ గ్రామంలో నివసిస్తున్న రంజ్ భొజొ భార్య సునాయి భొజ్ నిండు గర్భవతి. నెలలు నిండడంతో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆశ కార్యకర్త అంబులెన్స్‌కు సమాచారం అందించింది. అయితే గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో అంబులెన్స్ ఉండిపోవాల్సి వచ్చింది. గత్యంతరం లేక గర్భవతిని గ్రామస్తులు డోలీపై మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చారు. అనంతరం గర్భిణిని ఖయిరాపుట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. గర్భిణి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

– మల్కన్‌గిరి



శ్రీ మందిరం శిఖరాన మహా దీప సేవ

శ్రీ మందిరం శిఖరాన మహా దీప హారతి

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుడు కొలువై ఉన్న శ్రీ మందిరంలో ఏకాదశి తిథి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ తిథి పురస్కరించుకుని క్రమం తప్పకుండా శ్రీ మందిరం శిఖరాన నీల చక్రం ప్రాంగణంలో మహా దీప హారతి నిర్వహిస్తారు. రథ యాత్రలో పవిత్ర ఏకాదశి నాడు అత్యంత ఆకర్షణీయమైన స్వర్ణాలంకార దర్శనం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులకు శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో ఆలయ శిఖరంపై మహా దీప దర్శనం చేసుకునే అవకాశం లభిస్తుంది. స్వర్ణ అలంకార దర్శనం కొనసాగుతుండగా మహాదీప హారతి నిర్వహిస్తారు. దీనితో యాత్రకు తరలి వచ్చిన అశేష భక్తజనం ఆలయ శిఖరంపై మహా దీప హారతి కనులారా ప్రత్యక్షంగా తిలకించే అవకాశం పొందుతారు.

వెండి కలశాల్లో హారతి

మహా దీప హారతి కోసం 3 వెండి కలశాలు సిద్ధం చేస్తారు. వీటిని నెయ్యితో నింపుతారు. అరటి నారతో దీపం ఒత్తులు వినియోగిస్తారు. అరటి నారకు కొత్త బట్టను చుట్టి బలపరుస్తారు. తెల్ల రంగు వస్త్రం వినియోగిస్తారు. ఇలా సిద్ధం చేసిన మహా దీపాన్ని తొలుత శ్రీ జగన్నాథుని ముందు ద్యోతకం చేసిన తర్వాత, ఆలయం పైకి ఎత్తుతారు.



శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో భక్త జన సందోహం

గోడ కూలి మహిళ మృతి



దాబుగాంలో మహిళ మృతికి కారణమైన ఇళ్లు



దశమంత్‌పూర్ వెళ్లే మార్గాన్ని పునరుద్ధరిస్తున్న దృశ్యం

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీస్ స్టేషన్ పరిధిలోని జముండా గ్రామంలో గోడ కూలి రబి పనక (60) అనే మహిళ మృతి చెందింది. జయపూర్ సమితి టంకువ గ్రామ పంచాయతీ జగన్నాథపూర్–నువాగుడ మధ్య రోడ్డు బురదమయమైంది. దీంతో గ్రామం నుంచి బయటకు వెళ్లలేకపోతున్నామని గిరిజనులు తెలిపారు. మరోవైపు కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి కేంద్రానికి వెళ్లే మార్గం పునరుద్ధరణ పనులు వేగవంతం అయ్యాయి. లక్ష్మీపూర్ నియోజకవర్గంలో వర్షాల బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.



టంకువా పంచాయతీలో అధ్వానంగా మారిన రహదారి



లక్ష్మీపూర్ నియోజకవర్గంలో బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

రాయగడలో వినతుల స్వీకరణ



వినతులను వింటున్న కలక్టర్ పట్వారి పక్కనే ఎస్‌పి స్వాతి,అక్షయ్

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆధ్వర్యంలో సామవారం వినతుల స్వీకరణ చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన 68 మంది వినతులను అందజేశారు. వీటిలో 55 వ్యక్తిగత సమస్యలుగా, మిగతావి గ్రామ సమస్యలుగా పరిగణలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిది మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 45 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. గ్రామ సమస్యలను సత్వరంగా పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండో, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో మారు రథయాత్ర తిలకించి రాత్రి ఇంటికి వెళ్తున్న సమయంలో రెండు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగి నలుగురు గాయపడగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అందిన వివరాల ప్రకారం.. బొయిపరిగుడ సమితి కొలార్ పంచాయతీ దుదామగుడ గ్రామం సదన ఖొర, కందపాడాపాదర్ గ్రామం హరి ఖిలోలు బొయిపరిగుడలో బహుడ జాత్రకు ఒక బైక్‌పై వెళ్లారు. జాతర పూర్తయ్యాక వారు ఇళ్లకు బయల్దేరారు. టొపాజోడి కూడలి వద్ద ముందు వెళ్తున్న బస్సును బైక్ ఢీకొనడంతో సదన్, హరి రోడ్డుపై పడి గాయపడ్డారు. వీరిని స్థానికులు బొయిపరిగుడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సదన్‌కు తలపై గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అలాగే బొయిపరిగుడ శిశుమందిరం ప్రాంతంలో ఆదివారం రాత్రి బైక్ అదుపు తప్పి ఇద్దరు గాయపడ్డారు. జయపురం సమితి ఎస్.నువాగుడ గ్రామంలో త్రినాథ్ హరిజన్, అతడి మిత్రుడు బొయిపరిగుడ నుంచి జయపురం వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గాయపడిన ఇద్దరిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. వారిలో త్రినాథ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిసింది.

కాపాడబోయి.. ప్రాణాలు వదిలి

భువనేశ్వర్: కోణార్క్ ప్రాంతంలో సోమవారం దురదృష్టకర సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల్ని రక్షించబోయిన మరో పర్యాటకుడు దుర్మరణం పాలయ్యాడు. పూరీ పర్యటనకు విచ్చేసిన పర్యాటకుల బృందం కోణార్క్ సందర్శన కోసం కారులో బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు కోణార్క్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదానికి గురైన కారులో 11 మంది భక్తులు ఉన్నారు. వీరంతా మహారాష్ట్ర, విశాఖపట్నం నుంచి విచ్చేసిన పర్యాటకులుగా గుర్తించారు. ఆదివారం రాత్రి శ్రీ జగన్నాథుని స్వర్ణాలంకార దర్శనం చేసుకుని ఉదయం కోణార్క్ బయల్దేరారు. కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో చంద్రభాగ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవర్ సహా ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించే ప్రయత్నంలో ఒక పర్యాటకుడు విద్యుదాఘాతంతో మరణించాడు. మృతుడు జగత్‌సింగ్‌పూర్ జిలా నువాగాంవ్ గ్రామస్తుడు రంజిత్ పాఢియారిగా గుర్తించారు. ప్రమాదంలో చిక్కుకున్న బాధితులను కాపాడేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి కోణార్క్ పర్యటనకు వచ్చిన రంజిత్ పాఢియారి ప్రయత్నించాడు. సహాయం చేసేందుకు రంగంలో దిగిన రంజిత్‌కు దురదృష్టవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో సొమ్మసిల్లి పోయాడు. సత్వర చికిత్స కోసం అందుబాటులో ఉన్న ఆస్పత్రికి తరలించగా చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషాద సంఘటన సమాచారం అందడంతో అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న పర్యాటకులందరినీ రక్షించి చికిత్స కోసం కోణార్క్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చారు. ప్రథమ చికిత్స తర్వాత ఉన్నత చికిత్స కోసం బాధితుల్ని భువనేశ్వర్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కోణార్క్ ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించి దుర్ఘటన పాలైన టవేరా కారును స్వాధీనం చేసుకుని సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న పర్యాటకుల కారు

దేవతా మూర్తులకు స్వర్ణాలంకరణ



బంగారు ఆభరణాలతో అలంకరించిన శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర మూర్తులు



కొట్‌పాడ్‌లో స్వర్ణాలంకరణలో దేవతా మూర్తులు

జయపురం: చైతన్యమందిరం నుంచి శ్రీజగన్నాథ్, బలభద్ర, సుభద్రలతో ఉన్న పెద్ద రథం, పతిత పావనుడు ఉన్న చిన్న రథాలు రాత్రి 8.00 గంటలకు రథొపాడియ వద్దకు చేరాయి. దాదాపు రాత్రి పదకొండు వరకు భక్తుల పూజలు అందుకున్న దేవతా మూర్తులను జగన్నాథ ఆలయానికి తీసుకు వచ్చారు. లక్ష్మీదేవి అనుమతితో గర్భగుడిలోకి వెళ్లాక స్వర్ణాలంకరణ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ విభాగ అదనపు తహసీల్దార్ చిత్త రంజన్ పట్నాయిక్, జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కశ్యప్, పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్,జ యపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్‌లతో పాటు దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన



నిరసన ప్రదర్శనలో రెవెన్యూ సిబ్బంది

కొరాపుట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సోమవారం విధులకు హాజరయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టరేట్ వద్ద రెవెన్యూ మినిస్ట్రీయల్ ఉద్యోగులు ఆందోళన చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చనందున నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతున్నామని ప్రకటించారు. కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత విధానం అమలు చేయాలని, మరణించిన ఉద్యోగి కుటుంబంలో ఒకరికి మెరిట్ ఆధారంగా ఉద్యోగం ఇవ్వాలని, రూ. 20 లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, జిల్లా కలెక్టర్ల నివేదిక ప్రకారం కొత్త పోస్టులు సృష్టించాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల కోసం తాము పలుమార్లు ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. ఈ నెల 14వ తేదీలోపు తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే విధులు బహిష్కరిస్తామని ఉద్యోగులు ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో కలెక్టరేట్, సబ్ కలెక్టర్, తహసీల్దార్, ఐటీడీఏ, డీఆర్‌డీఏ, బీడీవో, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశుతోష్ మహంతి, ఉపాధ్యక్షుడు ధనుర్జయ మజ్జి, కైలాష్ చంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

జయపూర్‌లో షియా ముస్లింల ర్యాలీ

కొరాపుట్: పవిత్ర మొహరం సందర్భంగా జయపూర్‌లో షియా ముస్లింలు ఆదివారం ర్యాలీ జరిపారు. పట్టణంలోని వెల్‌కం జంక్షన్ నుంచి ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. మహమ్మద్ మనుమడు ఇమామ్ హుస్సేన్‌తో పాటు మరో 72 మందిని హత్య కాబడిన రోజు కాబట్టి దుఃఖ భరితమైన కార్యక్రమంగా భావిస్తారు. మొహరం నెల షియా ముస్లిం మతస్తులకు బాధాకరమైనదిగా భావిస్తారు. శతాబ్దాల క్రితం నుంచి కొరాపుట్ జిల్లా నందపూర్ ప్రాంతంలో షియా మతస్తులు మొహరం ప్రారంభించారు. ర్యాలీలో అధికసంఖ్యలో ముస్లిం మహిళలు పాల్గొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాఫ్రీ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఒడిశా శాఖ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హసన్ మదాని పాల్గొన్నారు.

పేదలకు సరుకులు పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక రైతుల కాలనీలోని నవజీవన్ ట్రస్టు ఆధ్వర్యం నిరుపేదలైన 40 మంది ఆదివాసీ వృద్ధ మహిళలకు బియ్యం, కంది పప్పు, దుంపలు, నూనె తదితర నిత్యావసర వస్తువులను సోమవారం పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీధర్ ఆచార్యులు నిరుపేదలకు ప్రతినెల ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని ట్రస్టు నిర్వాహకురాలు ఎం.నళిని తెలిపారు.

కొండ పైనుంచి జారి పడిన బండరాయి


కొండ నుంచి జారి పడిన బండరాయి

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి సెరిగుమ్మ నుంచి కొలనార సమితి దుందులికి అనుసంధానించే రహదారి మధ్యలోని కొండ నుంచి పెద్ద బండరాయి ఆదివారం సాయంత్రం జారి పడింది. దీంతో ఈ మార్గంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల ఏకధాటిగా కురిసిన వర్షాల కారణంగా కొండపై గల మట్టి జారి పడటంతో పాటు పెద్ద బండరాయి కూడా రహదారి మధ్యలోకి జారిపడింది. అటువైపుగా వెళ్లే కొందరు గ్రామస్తులు సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయడంతో సోమవారం ఉదయం కార్మికుల సహాయంతో బండరాయిని రోడ్డు పక్కకు నెట్టడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఘనంగా నవ జీవన్ ఆశ్రమం వార్షికోత్సవం

- 77 మంది వృద్ధులకు రేషన్ పంపిణీ


వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక డోలా ట్యాంకు రోడ్డులో ఉన్న నవజీవన్ అనాథ్రమం 18వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జువెనెల్ ప్యాలన్ జడ్జి భాగ్యలక్ష్మీ నాయక్, విశ్రాంత ఉపాధ్యాయులు బినోద్ జెన్నా, దాతలు గణేష్ పట్నాయక్, ప్రవీణ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీధర్ ఆచార్య 76వ జన్మదినం పురస్కరించుకుని అనాథ్రమంలో బాలబాలికలతో కేకు కట్ చేయించారు. అనంతరం అన్నలక్ష్మి పథకం కింద 77 మంది అనాథ వృద్ధులకు 10 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అతిథులు పంపిణీ చేశారు. ట్రస్టు చీఫ్ మేనేజర్ ఎస్.వి.రమణ, హౌస్ మదర్ ప్రభాషిణీకుమారి లిమ్మా, జయలక్ష్మి, బాబూరావు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: వర్సిటీ అధ్యాపకులు పరిశోధనా రంగంపై దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజనీ సూచించారు. పూనేలోని సెంటర్ ఫర్ సోషల్ రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ సంస్థ ప్రచురించిన 'సౌత్ ఆసియన్ జర్నల్ ఆఫ్ పార్టిసిపేటివ్ డవలప్‌మెంట్' ప్రత్యేక సంచికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన, అధ్యయన రంగాల్లో సాధించిన ప్రగతి వర్సిటీ పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. యూజీసీ గుర్తింపు పొందిన జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వారు తమ పరిశోధన పత్రాలను ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ అడ్డయ్య, సెమినార్ కన్వీనర్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, వాసవ్య మహిళా మండలి డైరెక్టర్ డాక్టర్ రష్మి, వైసీబీ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జయపూర్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి



జయపూర్ మున్సిపాలిటీ భవనం

- రాజకీయ పక్షాల డిమాండ్

కొరాపుట్: ప్రస్తుతం మున్సిపాలిటీగా ఉన్న జయపూర్ పట్టణాన్ని కార్పొరేషన్‌గా హోదా పెంచాలని రాజకీయ పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ చాలా కాలంగా ఉన్నప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. అయితే కొద్దిరోజుల క్రితం పూరీ మున్సిపాలిటీకి కార్పొరేషన్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో చిరకాలంగా కార్పొరేషన్ చేయాలని డిమాండ్ చేస్తున్న బాలేశ్వర్, జయపూర్ ప్రజలు కూడా తమ పట్టణాలను కూడా కార్పొరేషన్ హోదా కల్పించాలనే డిమాండ్‌ను తీవ్రం చేశారు. కేవలం పూరీని మాత్రమే కార్పొరేషన్ చేస్తారా.. జయపూర్ సంగతి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సుమారు నాలుగు శతాబ్దాల క్రితం సూర్యవంశీయులు జయపూర్‌ని రాజధానిగా చేసుకొని పరిపాలన చేశారు. నాటి పురాతన నగరం కార్పొరేషన్‌కి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని ప్రముఖులు పేర్కొంటున్నారు. దక్షిణ ఒడిశాలో బ్రహ్మపుర తర్వాత జయపూర్ పెద్ద పట్టణం. అవిభక్త కొరాపుట్ జిల్లాలో అతి పెద్ద పట్టణం జయపూరే. ఈ పట్టణంలో ప్రస్తుతం 28 వార్డులు ఉండగా పెరిగిన జనాభా దృష్ట్యా త్వరలో వార్డుల సంఖ్య పెరగనుంది. ప్రస్తుత జనాభా రెండు లక్షలకు చేరువలో ఉంది. జయపూర్‌ని కార్పొరేషన్ చేయాలనే ఉద్దేశంతో గతంలో ప్రభుత్వం రెండుసార్లు సర్వే కూడా చేసింది. సమీప భరణీపుట్, ఏక్తాగుడ, ఉమ్రి తదితర ప్రాంతాలను కలుపుతూ కార్పొరేషన్ చేయాలని నాటి సర్వేలో ప్రజలు వివరాలు అందించారు. 1953లోనే పురపాలక సంఘం ఏర్పడింది. పూరీ ప్రకటన నేపథ్యంలో గత రెండు రోజులుగా రాజకీయాలకు అతీతంగా డిమాండ్ పెరిగింది.

జయపూర్‌కి అన్ని అర్హతలు ఉన్నాయి



రాజరిక జయపూర్‌కు కార్పొరేషన్ హోదా కల్పించాలి. కార్పొరేషన్‌కు కావాల్సిన అన్ని అర్హతలు జయపూర్ పట్టణానికి ఉన్నాయి. మహా రాజులు, రాజులు, సామంతులు శతాబ్దాల క్రితమే దీన్ని నగరంగా గుర్తించారు. కార్పొరేషన్‌గా మార్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం. ఇది చాలా కాలంగా వస్తున్న డిమాండ్. వీలైనంత త్వరలో కార్పొరేషన్‌గా ప్రకటన చేయాలి.

–తారా ప్రసాద్ బాహినీ పతి, కాంగ్రెస్ ఎమ్మెల్యే, జయపూర్

తక్షణమే ప్రకటించాలి



కేవలం పూరీని మాత్రమే కార్పొరేషన్ చేయడం తగదు. అలా చూస్తే జయపూర్ కూడా పురాతన నగరమే కదా. కార్పొరేషన్ హోదా కోసం ఇప్పటికే రెండుసార్లు అధికారులు సర్వేలు కూడా చేశారు. కావాలంటే మరోసారి సర్వే చేయండి. జయపూర్‌ని కార్పొరేషన్‌గా తక్షణం ప్రభుత్వం ప్రకటించాలి.

–బీ.సునీత, మున్సిపల్ వైస్ చైర్మన్, బీజేడీ

ఎలుగుబంటి హల్‌చల్

- భయంతో పరుగులు తీసిన జనం


కర్రల డిపోలో సంచరిస్తున్న ఎలుగు బంటి


పపడాహండి-ఉమ్మర్‌కోట్ రాష్ట్ర రహదారిపై టురి వంతెన మీద ఎలుగుబంటి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రంలో ఎలుగు బంటి హల్‌చల్ చేసింది. సోమవారం సాయంత్రం జనసంచారం ఉన్నప్పటికీ పట్టణంలోకి ప్రవేశించింది. దాన్ని చూసిన ప్రజలు భయంతో పరుగులు తీశారు. పపడాహండి-ఉమ్మర్‌కోట్ రాష్ట్ర రహదారి 39 పై టురి వంతెన వద్ద కాసేపు సేద తీరింది. దానిని చూసి ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను వదిలేసి పరుగులు తీశారు. సమీప కర్రల డిపోలకి ప్రవేశించిన భల్లూకం కొంత సేపు అక్కడ సంచరించింది. తర్వాత నేరుగా పూజారి వీధి వద్దకు వెళ్లడంతో జనం భయంతో ఇళ్లకు తలుపులు వేసి మేడల మీదకి వెళ్లి పోయారు. పపడాహండి లోనికి ప్రవేశించడానికి ఆ ప్రాంతాల చుట్టూ కలియ తిరిగింది. చివరకు ప్రజల పెద్దగా కేకలు వేయడం, రాళ్లు విసరడంతో అటవీ ప్రాంతం లోనికి వెళ్లిపోయింది.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ కోండూరు గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్షా ఐదు వేల నగదు, ఐదు బైక్‌లు, ఐదు ఫోన్లు, పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కాశీనగర్ పోలీస్ అధికారి తెలియజేశారు.


పట్టుబడిన నగదుతో నిందితులు

గ్రీవెన్స్‌సెల్‌కు 63 వినతులు


పర్లాకిమిడి: ప్రజలతో మాట్లాడుతున్న జయకుమార్‌దాస్

పర్లాకిమిడి: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం గ్రామ ముఖి పరిపాలన, గ్రీవెన్సు సెల్‌కు జిల్లా పాలనాధికారి బిజయ కుమార్ దాస్‌తోపాటు జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి శంకర కెరకటా పాల్గొన్నారు. కత్తల కవిటి, రాణిపేట, సిద్ధమణుగు పంచాయితీ, పర్లాకిమిడి పురపాలక సంఘం నుంచి 63 వినతులు అందాయి. వాటిలో 49 వ్యక్తిగతం కాగా.. గ్రామ సమస్యలకు సంబంధించినవి 14 ఉన్నాయి. వాటిలో మూడు వినతులను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధిశాఖ పీవో అంశుమాన్ మహాపాత్రో, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.ఆలీ, గుసాని బీడీవో గౌరచంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో కలెక్టర్లు సోమవారం గ్రీవెన్ సెల్ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ నందపూర్ సమితి కేంద్రంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భారీ వర్షంలో కూడా మారుమూల అటవీ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 60 ఫిర్యాదుల చేశారు. ఇందులో 19 వ్యక్తిగత ఫిర్యాదులు, 41 సామాజిక ఫిర్యాదులున్నాయి. ఈ శిబిరంలో ఎస్డీపీఓ దేవేంద్ర, సీడీ వేణుధర్ సబర్, ప్రొహిబిషన్ ఐఏఎస్ అధికారి సంతోష్ మిశ్ర పాల్గొన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 40 ఫిర్యాదుల రాగా.. అందులో 36 వ్యక్తిగత, 4 సామాజిక ఫిర్యాదులున్నాయి.


కొరాపుట్ జిల్లా నందపూర్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

మరో మారు మన్మోహనే అధ్యక్షుడు

- నేడు అధికారిక ప్రకటన


మన్మోహన్ సామల్

భువనేశ్వర్: మన్మోహన్ సామల్ మరో మారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా పగ్గాలు చేపట్టనున్నారు. దాదాపు ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మండలి సభ్యుల ఎన్నిక కోసం సోమవారం నామినేషన్ పత్రాల దాఖలు చేశారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి మన్మోహన్ సామల్ ఒక్కరు మాత్రమే నామినేషను దాఖలు చేశారు. నామినేషను దాఖలు గడువు ముగిసే సరికి ఈ ఒక్క నామినేషన్ పత్రమే దాఖలు కావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా స్పష్టం అవుతుంది. మంగళ వారం తుది ఫలితాలు ప్రకటించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారులు తెలిపారు. కేంద్ర మండలి సభ్యత్వానికి 32 నామినేషను పత్రాలు దాఖలు అయ్యాయి. రాష్ట్ర శాఖ అధ్యక్ష పదవి పోటీకి నామమాత్రంగా ఒకే ఒక్క నామినేషన్ పత్రం దాఖలైందని ఎన్నికల పర్యవేక్షకునిగా నియమితులైన సంజయ్ జయస్వాల్ తెలిపారు.

మన్మోహన్ దక్షతకు పట్టం

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ కార్యకలాపాల్లో మన్మోహన్ సామల్ దక్షత రాష్ట్ర, కేంద్ర కార్యవర్గ ప్రముఖుల్ని ఆకట్టుకుంది. అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు ప్రతి ఒక్కరి నమ్మకాన్ని ఆయన కూడగట్టుకుని రెండోసారి వరుసగా అధ్యక్షునిగా ఎన్నిక అయ్యేందుకు మార్గం సుగమం చేసుకోవడం విశేషం. ప్రధానంగా రాష్ట్రంలో తొలి సారి పాలన పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీకి అంతర్గత సమస్యలు ఏమాత్రం అడ్డంకి కాకుండా అధ్యక్షుని హోదాలో మన్మోహన్ సామల్ దక్షత రాజకీయ ప్రముఖుల ప్రసంశలు అందుకుంది. మరో మూడేళ్లు ఆయన ఈ పదవీకాలంలో కొనసాగుతారు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లకు కీలక అధిపతుల నియామకం వివాదరహితంగా పూర్తి అయి పార్టీ మనుగడని మరింత బలోపేతం చేసే దిశలో మన్మోహన్ చాతుర్యం ప్రదర్శిస్తారని బీజేపీ రాష్ట్ర సభ్యులు విశ్వసిస్తున్నారు.

ఇదివరకు 1999 నుంచి 2004 సంవత్సరం వరకు పార్టీకి సారథ్యం వహించారు. తదుపరి 2023 మార్చి 23న మరో మారు అధ్యక్షునిగా బాధ్యతల్ని విజయవంతంగా నిర్వహించారు. ఆయన సారథ్యంలో పార్టీ అగ్ర శ్రేణి ఆదేశాలు, మార్గదర్శకాలు క్షేత్ర స్థాయిలో వాస్తవ కార్యాచరణ, అమలు చర్యలతో అధిష్టానం దృష్టిలో దక్షత పరుడుగా గుర్తింపు సొంతం చేసుకున్నారు. బూత్ స్థాయి, అట్టడుగు స్థాయిలో పార్టీ ఉనికి బలోపేతంలో ఆయనకు ఆయనే సాటిగా మన్ననలు పొందారు.

గత సంవత్సరం ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ మొదటిసారి ఒడిశాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 20 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. బీజేపీకి ఇదో ఊహాతీతమైన విజయం. సుదీర్ఘంగా అధికారంలో కొనసాగిన బిజూ జనతా దళ్ విపక్ష హోదాకు దిగజారింది. ఈ ఫలితాలతో బీజేడీ భారత పార్లమెంటులో దాదాపు ఉనికిని కోల్పోయింది. ఈ విజయంతో మన్మోహన్ సామల్ నాయకత్వంలో పురోగతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె. పి. నడ్డా వంటి జాతీయ ప్రముఖుల విశ్వాసం బలపడింది. రాష్ట్రంలో డబుల్‌ఇంజిన్ సర్కారుని కేంద్రంతో చక్కని సమన్వయంతో రాష్ట్ర సమగ్ర పురోగతిని వ్యూహాత్మకంగా నిర్వహించడం రాష్ట్రంలో తొలి సారిగా పాలన పగ్గాలు చేపట్టిన మోహన్ చరణ్ మాఝి సర్కారుకు చేదోడు వాదోడుగా మన్మోహన్ సామల్ అధ్యక్షత కొండంత బలంగా నిలుస్తుంది.

రాయగడలో వన మహోత్సవం


మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులతో ఎమ్మెల్యే కద్రక

రాయగడ: అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భారిజోల సమీపంలోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక ముఖ్యఅతిథిగా హాజరవ్వగా.. గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝిలు హాజరయ్యారు. అనంతరం హనుమాన్ మందిరం ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను నాటారు. నవజీవన్ ట్రస్టు ఆశ్రమంలోని విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కద్రక మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యానికి మొక్కలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ పట్వారి మాట్లాడుతూ.. ప్రభుత్వం అమ్మపేరుతొ ఒక చెట్టు అనే సందేశంతో ప్రారంభమైన వనమహోత్సవంలో విద్యార్థులు చురుగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పర్యావరణంపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్‌లో వారు తమ పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలకు నాంది పలుకుతారన్నారు. డీఎఫ్‌వో అన్నా సాహేబ్ అహలే, రేంజర్ కామేశ్వర్ ఆచారి కార్యక్రమాన్ని పరివేక్షించారు.


మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పట్వారి, ఎస్పీ స్వాతిలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


గాయాలతో చికిత్స పొందుతున్న బబులు


రాజేష్ (ఫైల్)


బసంత (ఫైల్)

మల్కనగిరి: ఎంవీ- 84 గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగపాల్ గ్రామానికి చెందిన రాజేష్ సొడి (20), బసంత కబాసి (18) దుర్మరణం పాలయ్యారు. బబులు మాడి అనేవ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం... ఒక మోటార్ సైకిల్‌పై రాజేష్, బసంత, బబులులు మారు రథ యాత్రను చూసేందుకు మల్కన్‌గిరి వెళ్లారు. రథ యాత్రను చూసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఎంవి-84 గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు కిందపడి గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించారు. అయితే బసంత, రాజేష్‌లు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వందేభారత్ కొరాపుట్ వరకు పొడిగించండి

- జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ భాహనీ పతి



కొరాపుట్: భువనేశ్వర్-విశాఖ మధ్య ప్రస్తుతం నడుస్తున్న వందేభారత్ రైల్‌ను అరుకు మీదుగా కొరాపుట్ వరకు పొడిగించాలని జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ భాహనీ పతి కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సోమవారం విజ్ఞపనతో కూడిన లేఖను రాశారు. వందే భారత్ రైల్ రోజూ 800 కిలోమీటర్లలోపు, రెండు వైపులా సుమారు 1600 కిలోమీటర్లు ప్రయాణించాలన్నారు. కానీ భువనేశ్వర్-విశాఖ మధ్య దూరం 440 కిలోమీటర్లు ఉందన్నారు. విశాఖపట్నం నుంచి కొరాపుట్‌కి 215 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. అందువలన రైల్‌ను పొడిగించినా నష్టం లేదన్నారు. ప్రస్తుతం వందేభారత్ రైలు రోజుకి సుమారు 900 కిలోమీటర్లు ప్రయాణం చేసి విశాఖలో నాలుగు గంటలు, భువనేశ్వర్‌లో ఆరేడు గంటలు ఉండి పోతుందన్నారు. కావున ఇలా పొడిగిస్తే కొరాపుట్ ప్రాంతానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పెరిగి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం కొరాపుట్ నుంచి భువనేశ్వర్‌కి నడుస్తున్న హిరాఖండ్ రైలు 680 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుందన్నారు. అదే అరుకు మీదుగా భువనేశ్వర్ 657 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. పగటి పూట నడిచే భువనేశ్వర్-విశాఖ వందే భారత్ ని అరుకు మీదుగా కొరాపుట్‌కు నడిపాలని విజ్ఞప్తి చేశారు. తన వినతి పత్రాన్ని రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి పంపించారు.

దేవకుపిలిని పంచాయతీగా గుర్తించాలి


బీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి కుముదాబల్లి పంచాయతీ పరిధిలో గల దేవకుపిలిని పంచాయతీగా గుర్తించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీడీఓ కృష్ణచంద్ర దళపతికి వినతిపత్రం అందించారు. జనాభా పరంగా అభివృద్ధి చెందుతున్న దేవకుపిలిని పంచాయతీగా గుర్తించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కుముదాబల్లి సర్పంచ్ గౌరి పిడిక, గ్రామస్తులు ఉన్నారు.

మజ్జిగౌరీ హుండీల ఆదాయం రూ. 1.04 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవా కమిటీ సభ్యులు

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరీ అమ్మవారి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో మందిరం ట్రస్టు అధ్యక్షులు రాయిసింగి బిడిక, సభ్యులు, మందిరం సూపరింటెండెంట్ సమక్షంలో మందిరం ప్రాంగణంలోని తొమ్మిది హుండీలను తెరిచారు. సాయంత్రం వరకు కొనసాగిన లెక్కింపులో భాగంగా అమ్మవారికి భక్తులు వేసిన కానుకల రూపంలో 1,04,36,963 రూపాయల నగదు, వెండి రెండు కిలోల 505 గ్రాములు, బంగారం 38 గ్రాములు లభించినట్లు మందిరం ట్రస్టు అధ్యక్షులు రాయిసింగ్ తెలిపారు. సాయంత్రం ఆరు గంటల వరకు లెక్కింపు కొనసాగిందని.. స్థానిక సేవా సంస్థలకు చెందిన మహిళలు, విద్యార్థులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ఇదిలాఉండగా ఈ ఏడాది జనవరి 27వ తేదీన హుండీ లెక్కింపులో భాగంగా అమ్మవారికి భక్తులు వేసిన కానుకల రూపంలో 94,49,054 రూపాయల నగదు, 93 గ్రాములు బంగారం, 2.170 కిలోల వెండి లభించినట్లు వివరించారు. అమ్మవారి హుండీ ఆదాయంలో భాగంగా ఇప్పటికి రెండుసార్లు కోటి రూపాయలు నగదుగా ఆదాయం సమకూరడం విశేషమని అన్నారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, ఇటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆది, మంగళ, బుధవారాల్లో అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారని అన్నారు. సోమవారం నాడు హుండీలో లభించిన నగదును స్థానిక ఉత్కళ గ్రామీణ బ్యాంకులో అమ్మవారి పేరిట డిపాజిట్ చేస్తున్నట్టు చెప్పారు. ఇదిలాఉండగా ఈసారి హుండీలో విదేశీ కరెన్సీ నోట్లు కూడా లభించడం గమనార్హం.


హుండీలో లభించిన విదేశీ కరెన్సీ నోట్లు

రెవెన్యూ ఉద్యోగుల నిరసన


కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఒడిశా రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సభ్యులు

పర్లాకిమిడి: ఒడిశా రెవెన్యూ అమలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలతో సోమవారం నిరసన చేపట్టారు. జూన్ 25న ఒడిశా రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గజపతిలో సంఘం కార్యదర్శి సంతును మిశ్రా నేతృత్వంలో 10 అపరిష్కృత డిమాండ్లను నెరవేర్చాలని అప్పటివరకూ నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం డిమాండ్లను 15 రోజుల్లోగా ప్రభుత్వం పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెలోకి దిగుతామని సంతును మిశ్రా తెలిపారు. ఒడిశా రెవెన్యూ ఉద్యోగులకు బేసిక్ పే 9 లెవల్‌కు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు స్వస్థ్య బీమా కార్డులు మంజూరు చేయాలని, పాత పింఛను అమలుచేయాలని, 1990లో జీఓ ప్రకారం ప్రభుత్వ సర్వీసు రూల్స్ ప్రకారం విధివశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం మంజూరు చేయాలని కోరారు. పదోన్నతలు, జూనియర్ అసిస్టెంటు అర్హత ప్రస్తుత డిగ్రీ నుంచి ఇంటర్‌కు మార్చాలని కోరారు.

క్లుప్తంగా

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: ఈ నెల 9వ తేదీన పార్వతీపురంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్. వహీదా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలలో జరగనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ ఫార్మా సంస్థలలో సుమారు 85 ఖాళీలను భర్తీ చేయడానికి మేళా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు www.ncr.gov.inwebrite లో లాగిన్ అయ్యి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యర్థులు తమ బయోడేటా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు రేపు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో గల వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పాలిటిక్స్, జువాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించి గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. దీంతో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి అదనపు అర్హతలు, అనుభవం కలిగి ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయంలో గాని, 98495 05940 నంబర్‌ను గాని సంప్రదించాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 9వ తేదీన కళాశాలలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు నేరుగా హాజరుకావాలని కోరారు.

కూలిన ఐటీడీఏ శిక్షణ భవనం



నేలమట్టమైన భవనం

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామంలో గల ఐటీడీఏ శిక్షణ భవనం సోమవారం కూలిపోయింది. గతంలో ఈ భవనంలో గిరిజన మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించేవారు. అయితే కొన్నేళ్లుగా ఈ భవనం ఖాళీగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బాగా నానిపోయి కూలిపోయింది.

అసభ్యకర వీడియో తీసిన వ్యక్తి అరెస్ట్



నిందితుడితో పోలీసులు

విజయనగరం క్రైమ్: విద్యల నగరమైన విజయనగరంలో నేర సంఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ప్రశాంత నగరంగా పేరుపొందిన విజయనగరం ఉగ్రవాది సిరాజ్ పుణ్యమా అని అపఖ్యాతి మూటగట్టుకుంది. తాజాగా వన్‌టౌన్ పరిధిలో అసభ్యకర వీడియో తీయడంపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఓ వివాహిత ఈ నెల 4వ తేదీన ఇంటిలో స్నానం చేస్తుండగా.. అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల పోలాకి గౌరీశంకర్ దొంగచాటుగా వీడియో తీశాడు. ఇది గమనించిన సదరు మహిళ గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. వెంటనే ఈ విషయాన్ని తన భర్తకు చెప్పడంతో ఆయన నిందితుడ్ని పట్టుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితుడ్ని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి ఫోన్ రికవరీ చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మార్గదర్శులను గుర్తించండి

విజయనగరం అర్బన్: పీ 4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులను గుర్తించే ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. గుర్తించిన వెంటనే బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, హెడ్‌మాస్టర్లతో కలెక్టర్ తన చాంబర్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సర్వే నిర్వహించి 67,066 మంది బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. అత్యధికంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 6,776, తక్కువగా ఎల్.కోట 1,221 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. ఈ కుటుంబాలన్నింటినీ దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గుర్తించాలని ఆదేశించారు. ఈ దత్తత ప్రక్రియ కూడా ఆన్‌లైన్‌లోనే జరగాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా గెజిటెడ్ ఉద్యోగులంతా ఇదొక సామాజిక బాధ్యతగా భావించి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, సీపీఓ పి.బాలాజీ, డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కవిత పాల్గొన్నారు.

మానవీయ కోణంలో.. అర్జీలను పరిష్కరించాలి

• కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులకు హితవు పలికారు. సమస్యల పరిష్కారంతో అర్జీదారులకు మేలు జరగాలని.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 109 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీదారులు తెలియజేసిన సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని సిబ్బందిక సూచించారు.

కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో 48గంటల్లోగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, కేఆర్ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్. పి. ధర్మచంద్రారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు ఎం. సుధారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఈ చిన్నారి పేరు సవర రిత్విక్. తల్లి సవర జ్యోతి, తండ్రి తిరుపతి. వీరిది సీతంపేట మండలం రేగుల గూడ గ్రామం. చిన్నతనం నుంచి ఎడమ కాలు పని చేయడం లేదు. ఈ చిన్నారికి సదరం సర్టిఫికెట్ ఉంది. అయితే తిరుపతికి ఉద్యోగం లేకపోయినా ఉందని చెబుతూ ఇంతవరకు చిన్నారికి పింఛన్ మంజూరు చేయలేదు. దీంతో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసేందుకు తల్లిదండ్రులతో చిన్నారి వచ్చింది.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- తోటపల్లి దేవాలయ ప్రాంగణంలో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఆవాల పకీరునాయుడు, తదితరులు కోరుతూ వినతిపత్రం అందజేశారు.
- గోశాల నిర్మాణానికి సంబంధించి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారని, అనుమతులు మంజూరు చేస్తే గోశాల పనులు ప్రారంభిస్తామని తెలియజేస్తూ తోటపల్లి సర్పంచ్ ఆవాల సింహాచలం, తదితరులు వినతి పత్రం ఇచ్చారు.

స్పందించని అధికారులకు షోకాజ్ నోటీసులు

• కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్‌ఎస్) వచ్చే వినతుల పట్ల సక్రమంగా స్పందించని అధికారులకు షోకాజ్ నోటీసులు అందించక తప్పదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించి 194 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ప్రతిరోజూ లాగిన్ అయి వినతులను పరిశీలించాలన్నారు. గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని ఆదేశించారు. వచ్చిన వినతుల్లో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 97 వినతులు అందాయని చెప్పారు.

అక్రమ ఆశీలుపై ఫిర్యాదు

జామి మండలంలోని అలమండ సంతలో లైసెన్స్ లేకుండా చిరువ్యాపారుల నుంచిన అక్రమంగా ఆశీలు వసూలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గంట్యాడ మండలం పెద వేమలి సర్పంచ్ వర్రి పాపునాయుడు అధికారులకు వినతి అందజేశారు.



పక్క ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు ఆర్య సోమయాజుల నాగేశ్వరరావు. ఈయనది పార్వతీపురం పట్టణం 19వ వార్డు. ఈయన ఆర్థోపెటిక్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛన్ మంజూరు కాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. భార్య సహాయంతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు.



ఈయన పేరు ఈశర్ల పోలయ్య. ఈయనది పాలకొండ మండలం బాసూరు గ్రామం. ఈయన అవిటితనంతో బాధపడుతున్నారు. నడవలేని స్థితిలో తన కుటుంబ సభ్యులతో బాసూరు గ్రామం నుంచి పార్వతీపురం కలెక్టరేట్‌కు ఆటోలో వచ్చి కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకున్నాడు. తనకు సదరం సర్టిఫికేట్ ఉన్నా పింఛన్ మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'వసుధైక కుటుంబం' సేవలు శ్లాఘనీయం



సైకిళ్లు అందుకున్న బాలికలతో సంస్థ డైరెక్టర్ సత్యకుమార్, తదితరులు

బాడంగి: కర్నాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన వసుధైక కుటుంబం (యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్) స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు శ్లాఘనీయమని వక్తలు కొనియాడారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అనాథ బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు డి.శ్రీనివాసరావు, సర్పంచ్ కండి రమేష్, పీఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు, భవిత టీచర్ ఈశ్వరరావు మాట్లాడుతూ.. సంస్థ వ్యవస్థాపకుడు రెళ్ల శ్రీనివాసరావు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. సంస్థ డైరెక్టర్ సత్యకుమార్ మాట్లాడుతూ.. కేబీఎస్‌బీఎఫ్‌సీ సహకారంతో 200 సైకిళ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరులో వంద మంది విద్యార్థులకు వెయ్యి రూపాయలు చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 36 పాఠశాలలకు చెందిన బాలికలు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

అనుమతుల్లేని పాఠశాలను రద్దు చేయండి



జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్: అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జేసీ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మక్కువ మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతుల్లేకుండానే ఫ్లెక్సీల్లో ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ సిలబస్‌లు ఉన్నట్లు పొందుపరిచి తల్లిదండ్రులను మోసం చేస్తోందన్నారు. పాఠశాలలో పుస్తకాలను కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. సదరు పాఠశాలకు తక్షణమే విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరికృష్ణ, దుర్గాప్రసాద్, నాయకులు వికాస్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ భూములు రైతులవే..

• రైతులకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి



మాట్లాడుతున్న మాజీ మంత్రి వద్దే శోభనాద్రీశ్వరరావు తదితరులు

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ కోసం సేకరించిన భూములపై పూర్తి హక్కులు రైతులకే ఉన్నాయని మాజీ వ్యవసాయశాఖా మంత్రి వద్దే శోభనాద్రీశ్వరరావు స్పష్టం చేశారు. జిందాల్ నిర్వాసితులకు సంఘీభావంగా బొడ్డవర గ్రామంలో ఎమ్మెల్సీ రఘురాజు స్వగృహంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. 18 ఏళ్లు గడిచినా పరిశ్రమ స్థాపించకపోతే కంపెనీకి భూములపై ఏ హక్కు ఉంటుందని ప్రశ్నించారు. జిందాల్‌పై పోరాటం చేస్తున్న రైతులకు ఏపీ రైతు సంఘాలు సమైక్యంగా మద్దతిస్తాయన్నారు. రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసి బడా నాయకులు, కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్ మాట్లాడుతూ.. రైతుల నుంచి భూములు లాక్కుంటే వారి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. సేకరించిన భూముల్లో కంపెనీలు పెట్టకపోతే మూడేళ్ల తర్వాత ఆ భూములు రైతులకే చెందుతాయని చెప్పారు. 'లీడర్' పత్రిక సంపాదకుడు రమణమూర్తి మాట్లాడుతూ, రైతులు భూములు వదులుకోవాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ఢిల్లీలో రైతు ఉద్యమ స్ఫూర్తితో మనం పని చేయాలన్నారు. నాడు ప్రభుత్వ సమక్షంలో ఒప్పందం జరిగింది కాబట్టి.. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. రైతులకు అండగా అన్నివర్గాలు నిలుస్తున్నాయని చెప్పారు. జిల్లా రైతుసంఘ అధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడుతూ... పక్షం రోజులుగా రైతులు రోడ్డున పడి ఆందోళన చేస్తుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం బాధాకరమన్నారు. సమస్యని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాల, వర్గాల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో జిందాల్‌కు భూములిచ్చిన ఐదు పంచాయతీల రైతులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

• కుమారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన కారు



తీవ్రంగా గాయపడిన దేవీ సంతోష్‌కుమార్



రమణమూర్తి (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బీజేపురం గ్రామానికి చెందిన కరకవలస రమణమూర్తి (57) ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ కొంతకాలంగా పార్వతీపురంలో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం కుమారుడు దేవీ సంతోష్‌కుమార్‌తో కలిసి విశాఖపట్నం మద్దిలపాలెంలో ఉన్న కుమార్తె గాయత్రి ఇంటికి వెళ్లేందుకు ఏపీ 35కేజీ 9236 నంబర్ గల కారులో బయలుదేరారు. సరిగ్గా ఆనందపురం బ్రిడ్జి సమీపంలోకి వచ్చే సరికి ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందగా.. కుమారుడు సంతోష్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడ్ని విశాఖపట్నం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ఆనందపురం సీఐ చింత వాసునాయుడు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సానుకూలంగా స్పందించండి



విజయనగరం క్రైమ్: అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

• ఎస్పీ వకుల్ జిందల్
• పీజీఆర్‌ఎస్‌లో 40 వినతుల స్వీకరణ

విజయనగరం క్రైమ్: అర్జీదారులు తెలియజేసిన సమస్యలపై సానుకూలంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్మం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలియజేసిన సమస్యలను సానుకూలంగా విన్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 40 ఫిర్యాదులు స్వీకరించగా.. ఇందులో భూ తగాదాలకు సంబంధించినవి 13.. కుటుంబ కలహాలకు సంబంధించినవి 4.. మోసాలకు పాల్పడినవి 5.. ఇతర అంశాలకు సంబంధించినవి 18 ఫిర్యాదులున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

తక్షణమే చర్యలు తీసుకోవాలి..

పార్వతీపురం రూరల్: అర్జీదారులు తెలియజేసిన సమస్యల్లో వాస్తవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో వివిధ సమస్యలపై వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన అర్జీలను తానే స్వయంగా పరిశీలించిన అనంతరం సంబంధించిన స్టేషన్ అధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కువగా కుటుంబ కలహాలు, భూ, ఆస్తి వివాదాలు, సైబర్ మోసాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల వసూళ్లు, ప్రేమ పేరుతో మోసాలపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మొత్తం 16 వినతులు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో కొత్తవలస విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులతో మాస్టర్ రాజు

కొత్తవలస: మండల కేంద్రంలోని శివశక్తి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అకాడమికీ చెందిన జి.తపస్వి, కె.ధన్విక, జి.ఊర్వజ ఈ నెల 5న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాలో నటరాజ నర్తనయజ్ఞంలో భాగంగా నిర్వహించిన భరతనాట్యం ప్రదర్శనలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రదర్శనలో మూడు వేల మంది విద్యార్థులు 27 నిమిషాల 31 సెకెన్ల పాటు నృత్యం చేసి ప్రపంచ రికార్డు నమోదు చేశారని మాస్టర్ కేపీ రాజు తెలిపారు. విద్యార్థినులు పలువురు అభినందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యంతో పట్టుబడిన ఆటో

జామి: మండలంలోని భీమసింగి వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను విజిలెన్స్, సీఎస్‌డీటీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వాకచర్ల నరేష్ అనే వ్యక్తి మీసాల నాయుడు ఆటోలో బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. అధికారులు ఆటో సీజ్ చేసి 856 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నరేష్, నాయుడులపై కేసు నమోదు చేసి, బియ్యంను భీమసింగి -1 డిపోకు అప్పగించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ వీవీఎస్ మూర్తి, విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, హెచ్‌సీలు పురుషోత్తం, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మడ్డువలస నీరు విడుదల



మడ్డువలస కుడికాలువ ద్వారా సాగునీటిని విడిచిపెడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్ట్ కుడి ప్రధాన కాలువ ద్వారా ఖరీఫ్ పంటల సేద్యానికి రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సోమవారం సాగునీటిని విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఆవరణలో ఉన్న కుడి ప్రధాన కాలువ హెడ్ స్లూయిస్ వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్విచ్ ఆన్ చేసి సాగునీటిని విడిచిపెట్టారు. తొలి రోజు 100 క్యూసెక్కుల నీటిని వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయకట్టు పరిధిలో ప్రతి ఎకరాకూ సాగునీటిని అందేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొత్స వాసుదేవరావునాయుడు, పిన్నింటి మోహనరావు, పైల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాగ్వాదంపై కలెక్టర్ అసహనం..

• అట్రాసిటీ కేసు పెట్టమని వన్‌టౌన్ సీఐని ఆదేశించిన వైనం

విజయనగరం క్రైమ్: జిందాల్ సమస్యపై మాట్లాడేందుకు వచ్చిన సీపీఎం నాయకుడు బెహరా శంకర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ సీఐని కలెక్టర్ డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ సోమవారం ఆదేశించారు. జిందాల్ సమ స్యకు సంబంధించి కొత్తవలసకు చెందిన గిరిజనులతో కలెక్టరేట్‌కు వచ్చిన సీపీఎం నాయకుడు బెహరా శంకర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి సమర్పించారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ సమస్యను ఇప్పటికే ఒక కొలిక్కి తీసుకువచ్చామని చెబుతుండగా.. శంకర్ అడ్డుతగలడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమయంలో కాస్త గలాటా జరగడంతో వెంటనే వన్‌టౌన్ సీఐని పిలిచి శంకర్‌పై కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా.. కలెక్టర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

ముగ్గురికి జైలు శిక్ష

విజయనగరం క్రైమ్: జిల్లాలోని రేగిడి ఆముదాలవలస పోలీస్‌స్టేషన్‌లో 2023లో నమోదైన గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికీ నాలుగు సంవత్సరాల జైలు శిక్ష, రూ. పది వేల జరిమాన విధిస్తూ శ్రీకాకుళం ఒకటో ఏడీజే జడ్జి పి. భాస్కరరావు సోమవారం తీర్పు చెప్పారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. కేసు వివరాల్లోకి వెళితే.. రేగిడి ఆముదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో బూరాడ జంక్షన్ వద్ద 07.08.2023న పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా.. వి. రాంబాబు అనే వ్యక్తి 1.8 కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరో ఇద్దరు నిందితులు పి. వెంకటేష్, పి.జీనాబందుస్‌లను అప్పటి రాజాం సీఐ ఉపేంద్ర అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మరో 4.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నేరం రుజువుకావడంతో నిందితులకు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసరావు వాదనలు వినిపించగా, కోర్టు హెడ్ కానిస్టేబుల్ అప్పారావు, ఆర్.ఎ.వలస ఎస్సై నీలావతి, రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సాక్ష్యులను ప్రవేశ పెట్టారు.

ప్రైవేటు స్కూళ్లలో మెగా పీటీఎం నిర్వహించాలి

• రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు వాడొద్దు
• విద్యాసంస్థలకు కలెక్టర్ అంబేడ్కర్ సూచన

విజయనగరం అర్బన్: మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (మెగా పీటీఎం)ను ఈ నెల 10న ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కూడా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆదేశించారు. ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించాలని సూచించారు. దీనికోసం ప్రతీ విద్యాసంస్థ తమ పేరును నమోదుచేసుకోవాలన్నారు. ఈ సారి విద్యార్థుల తల్లి పేరుమీద మొక్కను నాటాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. దీనికోసం జిల్లాలో 20 లక్షలకు మొక్కలు అందుబాటులో ఉంచామన్నారు. పాఠశాలల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు కట్టకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పీటీఎంలకు ప్రముఖవ్యక్తులను ఆహ్వానించి విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఇప్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ మాణిక్యం నాయుడు, ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు, ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.